


పింఛన్లు పంపిణీ చేస్తున్న కలెక్టర్ రంజిత్ బాషా, ఎమ్మెల్యే గౌరు చరిత, సర్ఫ్ సిఇఒ వీరపాండ్యన్



కబ్జాకు గురయిన చెరువులు

- చెరువుల కింద ఆయకట్టు ప్రశ్నార్థకం
- ఆక్రమణలకు గురయిన 21 చెరువులు
- హద్దులు గుర్తిస్తే గాని తేలని కబ్జాలు
- స్పందించని రెవెన్యూ, నీటిపారుదల అధికారులు
- జిల్లాలో 310 చెరువులు, కుంటల కింద 33,113 ఎకరాల ఆయకట్టు

ప్రజాశక్తి -కర్నూలు అగ్రికల్చర్

వ్యవసాయం సాగు పెరగాలంటే పుష్కలమైన నీటివనరులు ఉండాలి. నీటిని అత్యధికంగా అందించే జీవనాడులు చెరువులు, కుంటలు అలాంటివి రోజు రోజుకు కబ్జాకు గురయి కనుమరుగతువున్నా పట్టించుకునే నాథుడే లేడు. భూగర్భ జలాలు అడుగంటుతున్నా, బోర్లు ఎండిపోతున్నా తాగడానికి నీరు లేకున్నా ప్రధాన నీటి వనరుగా ఉన్న చెరువులను కాపాడాల్సిన అవసరం ఉంది. ఏ ఒక్క ప్రజా ప్రతినిధి కూడా కబ్జాలపై స్పందించడం లేదు. గతేడాది వర్షాభావ పరిస్థితుల వల్ల అత్యధిక బోర్లు అడుగంటాయి. ఇప్పటికే కర్నూలు జిల్లాలో కొందరు అక్రమదారులు దాదాపు 21 చెరువులను కబ్జాచేశారు. ఇలాంటి ఆక్రమణల నుండి చెరువులను కాపాడి వ్యవసాయ రంగానికి సాగు, తాగు నీరు అందేలా చూడాల్సిన అవసరం ఉంది.

జిల్లాలో దాదాపు చెరువులు ,కుంటలు కలిపి 310 దాకా ఉన్నాయి. గతంలో పంచాయితీ రాజ్ శాఖ ఆధ్వర్యంలో ఉండి ప్రస్తుతం నీటిపారుదల శాఖకు బదిలీ చేశారు. ఈ చెరువులు కుంటల కింద 33,113 ఎకరాలలో పంటలు సాగు చేస్తున్నారు. 61 శాతం చెరువుల కింద మాత్రమే సాగుచేస్తున్నారు. మిగతా చెరువులు నిరుపయోగంగా ఉన్నాయి. జిల్లాలో చెరువులను కబ్జాచేసిన వారిలో ప్రధానంగా ప్రజాప్రతినిధులు వారి అనుచర వర్గమే ఎక్కువగా ఉన్నారు. అధికారులు ప్రశ్నిస్తే అధికారపార్టీ అండదండలు ఉండటంవల్ల చేసేది ఏమి లేక నిమ్మకుంటున్నారు. జిల్లాలో పెద్ద చెరువులు అయిన ఆలూరు, చెరువు దాదాపు 175 ఎకరాల్లో ఉంది. 50 ఎకరాల దాకా కబ్జాకు గురయ్యాయి. ఈ చెరువులో చాలా వరకు ఇళ్ల నిర్మాణం కూడా చేపట్టారు. ఆదోనిలో కూడా చెరువులు ఆక్రమణలకు గురయ్యాయి. ఇలా అనేక ఇతర స్థానిక రాజకీయ పరిస్థితులు వల్ల ఆరు శాతం చెరువుల కింద ఎలాంటి సాగు చేయడం లేదు. ఈ చెరువులకింద దాదాపు 3400 ఎకరాల సాగు ఉండవచ్చని అంచనా. ఇకపోతే 77 చెరువుల నింపే కార్యక్రమంలో కర్నూలు జిల్లాలో (డోన్ మినహాయిస్తే)దాదాపు 29 చెరువులకు పూర్తి స్థాయిలో 2024-25 సంవత్సరానికి నీరు నింపే అవకాశం ఉందని నీటి పారుదల శాఖ అధికారులు చెబుతున్నారు.



హద్దులు గుర్తిస్తే కానీ తేలని ఆక్రమణలు

జిల్లాలో చెరువులు కుంటలు కలిపి 310 దాకా ఉన్నాయి. ఇందులో అధికారిక లెక్కల ప్రకారం దాదాపు 21 చెరువులు ఆక్రమణకు గురి అయినట్టు అధికారులు అంచనా వేశారు. ఇంకా ఎన్ని చెరువులు ఆక్రమణ చేసి చేరపట్టారో తెలక ప్రశ్నార్థకంగా మారింది. చెరువుల ఆక్రమణలు గుర్తించాలంటే రెవెన్యూ అధికారులు పాత్ర కీలకంగా ఉందని రెవెన్యూ అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తనట్టు ఉన్నారు. చెరువుల ఆక్రమణలు గుర్తించాలంటే రెవెన్యూ శాఖ, నీటిపారుదల, పోలీస్ అధికారులు అందరి సమన్వయంతో ప్రతి చెరువును హద్దులు గుర్తిస్తే కానీ పూర్తి ఆక్రమణలు తేలవని ఆ దిశగా రాష్ట్ర ప్రభుత్వం చెరువుల ఆక్రమణలపై ప్రత్యేక కమిటీని నియమించి చర్యలు తీసుకోవాలి. వెంటనే హద్దులు ఏర్పాటు చేసేలా ఆదేశించాలి. చెరువులను కాపాడాలి.

చెరువులను నింపేల చర్యలు తీసుకోవాలి ఆదేశించిన ముఖ్య కార్యదర్శి

జిల్లాలో ఉండే అన్ని చెరువులను వాటికి అనుసంధానంగా ఉండే నదులు, కాలువల ద్వారా తక్షణమే చెరువులు నింపాలని అవసరమైన చోట లిఫ్ట్ చేసి నీటిని నింపాలని టెలికాన్ఫిరెన్స్ ద్వారా నీటిపారుదలశాఖ ముఖ్య కార్యదర్శి జి.సాయి ప్రసాద్ ఆదేశించారు. ఆ దిశగా జిల్లాలో వెంటనె చర్యలు చేపట్టాలని వాటికి తగిన నివేదికలు పంపాలని జిల్లా అధికారులను ఆదేశించారు.

చెరువుల ఆక్రమణలపై చర్యలు

- ప్రస్తుతం నీటిని నింపేలా కార్యాచరణ
- జిలాని బాష, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్. చిన్ననీటి పారుదల శాఖ



కబ్జాకు గురయిన చెరువుల ఆక్రమణలు పరిశీలిస్తున్నాం. రెవెన్యూ అధికారుల సమన్వయం అవసరం. హద్దులు నిర్దేశించడం ముఖ్యం. చెరువులకు నీటిని నింపేలా ఉన్నతాధికారుల ఆదేశానుసారం నివేదికలు సిద్ధం చేశాం. కాలువలు, నదుల అనుసంధానంగా నింపడానికి , అవసరం అయిన చోట లిఫ్ట్‌ద్వారా నీటిని నింపేలా చర్యలకు అధికారులు ఆదేశించారు. అందుకు తగిన కార్యాచరణ ప్రణాళిక తయారు చేశాం.

ఓర్వకల్లులో పింఛన్ల పంపిణీ

- సెర్ఫ్ సిఇఒ, కలెక్టర్, ఎమ్మెల్యే గౌరు చరిత హాజరు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

రాష్ట్ర ముఖ్యమంత్రి ఓర్వకల్లో శనివారం నిర్వహించాల్సిన పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని అధికారులు యధావిధిగా నిర్వహించారు. సెర్ఫ్ సిఇఒ జి.వీర పాండ్యన్, జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా, ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి, టిడిపి నంద్యాల జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఓర్వకలు గ్రామపంచాయతీ పరిధిలోని లబ్ధిదారుల వద్దకే వెళ్లి ఎన్‌టిఆర్ భరోసా పింఛన్లు నగదు పంపిణీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ సిఎం చంద్రబాబు నాయుడు పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొనాల్సి ఉండగా అనివార్య కారణాలతో రద్దయిందన్నారు. నిరుపేదలకు ప్రతినెలా ఒకటో తేదీన పింఛన్ నగదును అందజేస్తామని పేర్కొన్నారు. లబ్ధిదారులకు ఇబ్బంది లేకుండానే ఇంటి వద్దకే వచ్చి పింఛన్ అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌డిఎ పిడి సలీంబాష, ఎంపిడిఒ నాగ శివప్రసాద్, తహశీల్దార్ వెంకటరమణ, టిడిపి మండల కన్వీనర్ గోవిందరెడ్డి తోపాటు స్థానిక నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీ 96 శాతం పూర్తి : ఎన్టీఆర్ భరోసా కార్యక్రమం కింద జిల్లా వ్యాప్తంగా పింఛన్ల పంపిణీ ప్రక్రియ 96శాతం పూర్తయినట్లు జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ సలీంబాష వెల్లడించారు. జిల్లాలో మొత్తం 2,42,583 పెన్షన్లకు గాను 2,33,056 పెన్షన్లు పంపిణీ చేసినట్లు వెల్లడించారు. పెన్షన్ల పంపిణీ 100శాతం పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

జిల్లాలో విస్తారంగా వర్షం

- అత్యధికంగా కర్నూలు రూరల్‌లో నమోదు
- పంటలకు జీవం పోసినవర్షం

ప్రజాశక్తి-కర్నూలు అగ్రికల్చర్

జిల్లా వ్యాప్తంగా రెండు రోజులుగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. అధికారులు నమోదు చేసిన వివరాల ప్రకారం అత్యధికంగా కర్నూలు రూరల్‌లో 42.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు అయ్యింది. అత్యల్పంగా ఆలూరు లో 4.2 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. ప్రస్తుతం వర్షం కురవడంతో వాడుముఖం పట్టిన పంటలకు కాస్త జీవం పోసినట్టు అయిందని రైతులు హర్షం వ్యక్తం . వర్షపాతం నమోదు వల్ల పొగాకును జిల్లా లో చాలా చోట్ల నాట్లు మొదలు పెట్టారు. చాలా గ్రామాల రహదారులు అస్తవ్యస్తంగా అయ్యాయి. నగర ప్రాంతాల్లో కాలువలు పొంగిపొర్లుతున్నాయి. చాలా చోట్ల రోడ్లపై నీరు చేరడం వల్ల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. గ్రామీణ ప్రాంత రోడ్లు జలమయం అయ్యాయి.



కర్నూలు జిల్లాలో సిఎం పర్యటన రద్దు

- తలమునుకలై ఏర్పాట్లు చేసిన యంత్రాంగం

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ఎన్‌టిఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొనేందుకు కర్నూలు జిల్లా ఓర్వకల్లుకు రావల్సిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పర్యటన శనివారం రద్దు అయింది. శుక్రవారం అర్ధరాత్రి నుంచే అల్పపీడనం కారణంగా భారీ వర్షాలు దురుస్తున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి పర్యటన నిలిచిపోయింది. ముందుగా సిఎం పర్యటన పత్తికొండ మండలం పుచ్చకాయల మాడ గ్రామంలో నిర్వహిస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. ఓర్వకల్లు ఎయిర్‌పోర్టు నుంచి పత్తికొండకు హెలిక్యాప్టర్‌లో పోవడం వాతావరణం అనుకూలించదని శుక్రవారం సాయంత్రానికి మార్పు చేసి ఓర్వకల్లు మండల కేంద్రంలో ఏర్పాట్లు చేశారు. ఓర్వకల్లు గ్రామపంచాయతీలో పెన్షన్లు పంపిణీతో పాటు అక్కడే గ్రామస్తులతో సమావేశం ఏర్పాటుకు ఏర్పాట్లు కూడా అధికార యంత్రాంగం చేసింది. సభా వేదిక వద్ద ఎలాంటి వర్షపు నీరు నిలవకుండా అధికారులు ఏర్పాట్లు చేశారు. అయితే ఎడతెరిపి లేకుండా కురుస్తున్న నేపథ్యంలో చివరి నిమిషంలో సిఎం పర్యటన నిలిచిపోయింది. ఓర్వకల్లు ఎయిర్‌పోర్టు నుండి ఓర్వకల్ గ్రామపంచాయతీకి సిఎం చంద్రబాబు రోడ్డు మార్గం ద్వారా వచ్చేందుకు కూడా పోలీసు యంత్రాంగం చర్యలు తీసుకుంది. సిఎం పర్యటన నేపథ్యంలో శుక్రవారం సాయంత్రం నుండి శనివారం తెల్లవారుజాము వరకు త్వరతగతిన సభావేదిక , బందోబస్తుకు కావల్సిన చర్యలను తీసుకున్నారు. ఈ పర్యటన నేపథ్యంలో ఎమ్మెల్యే గౌరు చరిత స్వయంగా ఏర్పాట్లను పర్యవేక్షించారు. సిఎం పర్యటన రద్దు కావడంతో అధికార పార్టీ నేతలు కార్యకర్తలు నిరాశతో వెనుతిరిగి వెళ్ళిపోయారు. సిఎం పర్యటన ప్రోటోకాల్ డ్యూటీకి వచ్చిన అధికారులు, పోలీసులు వెనుదిరిగి వెళ్లారు.

'నామినేటెడ్'పై ఆశలు..!

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

ఉమ్మడి కర్నూలు జిల్లాలో టిడిపి కూటమి మంచి విజయాన్నే సాధించింది. జిల్లాలో 14 అసెంబ్లీ, రెండు పార్లమెంట్ స్థానాలు ఉండగా 11 అసెంబ్లీ స్థానాల్లో టిడిపి, ఒక అసెంబ్లీ స్థానంలో బిజెపి అభ్యర్థి కూటమి తరపున గెలుపొందారు. రెండు పార్లమెంట్ స్థానాల్లోనూ టిడిపి అభ్యర్థులు విజయం సాధించారు. ఎన్నికల్లో సీట్ల కేటాయింపు సమయంలో కొందరు అభ్యర్థులకు మొండి చేయి చూపి ఇతరులకు సీటును కేటాయించారు. వారికి ఏదో ఒక పదవి ఇస్తామంటూ బుజ్జగించారు. అలాంటి వారందరూ ప్రభుత్వంలో తమకు ఏదో ఒక నామినేటెడ్ పదవి వస్తుందన్న ఆశతో ఉన్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లా వ్యాప్తంగా నామినేటెడ్ పదవులు ఆశించి వారి సంఖ్య ఎక్కువగానే ఉంది. టిడిపి ప్రభుత్వం నామినేటెడ్ పదవుల భర్తీపై దృష్టి సారించడంతో ఎవరికి వారు తమ తమ స్థాయిలో జోరుగా ప్రయత్నాలు సాగిస్తున్నారు. నామినేటెడ్ పదవులు ఆశిస్తున్న వారిలో టిడిపి జిల్లా అధ్యక్షులు పాలకుర్తి తిక్కారెడ్డి, దోని టిడిపి నియోజకవర్గ ఇంఛార్జీ మీనాక్షి నాయుడు, కోడుమూరు నియోకవర్గ సమన్వయకర్త విష్ణువర్ధన్ రెడ్డి, నంద్యాల నియోజకవర్గ మాజీ ఇంఛార్జీ భూమా బ్రహ్మానంద రెడ్డి, మైనార్టీ నాయకులు వాహిద్ హుస్సేన్ ఉన్నారు. రెండు సార్లు మంత్రాలయం నియోజకవర్గం నుంచి పోటీ చేసి ఓడిపోయి 2024 ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలని అనుకున్న పాలకుర్తి తిక్కారెడ్డి ఆయన సీటును త్యాగం చేయాల్సి వచ్చింది. రాఘవేంద్రరెడ్డికి టిడిపి టికెట్ ఇచ్చారు. తిక్కారెడ్డికి టిడిపి జిల్లా అధ్యక్ష పదవిని అప్పగించారు. అధికారంలోకి వస్తే సమున్నత పదవి ఇస్తామని అదిష్టానం హామీ ఇచ్చింది. దీంతో ఆయన ప్రస్తుతం నామినేటెడ్ పదవుల భరీలో ఉన్నారు. పదవులు ఆశిస్తున్న వారిలో డోన్ నియోజకవర్గ మాజీ ఇంఛార్జి ధర్మవరం సుబ్బారెడ్డి కూడా ఉన్నారు. ప్యాపిలి మండలం జలదుర్గంలో జరిగిన బాదుడే బాదుడు సభలో టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు డోన్ టిడిపి అభ్యర్థిగా సుబ్బారెడ్డిని ప్రకటించారు. తీరా ఎన్నికల సమయంలో ఆయనను కాదని డోన్ సీటును కోట్ల సూర్యప్రకాష్ రెడ్డికి ఇచ్చారు. నంద్యాల టికెట్ ఆశించిన భూమా బ్రహ్మానందరెడ్డి, వాహిద్ హుస్సేన్‌లకు మొండిచేయి చూపి ఆ టికెట్‌ను ఎన్‌ఎండి ఫరూక్‌కు ఇచ్చారు. ఆ సమయంలో వారికి న్యాయం చేస్తామని అదిష్టానం హామీ ఇచ్చింది. ఆలూరు నియోజకవర్గ సమన్వయకర్తగా పని చేసిన కోట్ల సుజాతమ్మ, మాజీ మంత్రి కెఇ ప్రభాకర్, రాష్ట్ర గొర్రెల సహకార సంఘం అధ్యక్షుడిగా పని చేసిన నాగేశ్వర్ యాదవ్‌తో పలువురు జనసేన, బిజెపి నేతలు కూడా నామినేటెడ్ పదవులను ఆశిస్తున్నట్లు తెలుస్తోంది.

విద్యుత్ అమరులకు నివాళి : విద్యుత్ అమరవీరుల దినోత్సవం సందర్భంగా జిల్లా వ్యాప్తంగా నివాళులు అర్పించారు. విద్యుత్ అమరవీరుల పోరాట స్ఫూర్తితో నేటి పాలకులు తెస్తున్న విద్యుత్ సంస్కరణలను తిప్పికొట్టాలని నాయకులు పిలుపునిచ్చారు. విద్యుత్ సంస్కరణలకు వ్యతిరేకంగా పోరాటం చేయడం ద్వారానే ఆనాటి పోరాటంలో అమరులైన సత్తెనపల్లి రామకృష్ణ, బాలస్వామి, విష్ణువర్ధన్ రెడ్డిలకు నిజమైన నివాళి అని అన్నారు.

ఓటర్ల జాబితా సవరణ : ఓటర్ల జాబితా సవరణలో భాగంగా ఓటు హక్కు నమోదుకు రాష్ట్ర ఎన్నికల సంఘం చర్యలు చేపట్టింది. ఈ మేరకు ఓటర్ల జాబితా సవరణకు నోటిఫికేషన్ విడుదల చేశారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకునేందుకు దరఖాస్తులను స్వీకరిస్తారు. ఓటర్ల జాబితా సవరణ 2024లో భాగంగా ఓటర్ల జాబితాలో మార్పులు చేరుకులతో పాటు కొత్తగా ఓటు హక్కు నమోదుకు దరఖాస్తులను స్వీకరిస్తారు. ఓటర్ సవరణలో భాగంగా బిఎల్వోలు ఇంటింటి సర్వే చేపట్టి ఓటర్ల జాబితాను పరిశీలన చేస్తారు. ఈ ప్రక్రియను అక్టోబర్ 20 వరకు నిర్వహిస్తారు. అక్టోబర్ 29న సమగ్ర ఓటర్ల జాబితాను పోలింగ్ కేంద్రాల్లో ప్రచురిస్తారు. అక్టోబర్ 29 నుండి నవంబర్ 28 వరకు ఈ జాబితా పై అభ్యంతరాలను దరఖాస్తులను స్వీకరిస్తారు. నవంబర్ 9, 10, 23, 24 తేదీలలో బిఎల్‌ఒల ద్వారా ప్రత్యేక క్యాంపులను నిర్వహిస్తారు. డిసెంబర్ 24 తేదీలోగా అభ్యంతరాలను పరిష్కరిస్తారు. 2025 జనవరి 6వ తేదీన తుది ఓటర్ల జాబితాను ప్రకటిస్తారు.



ఎంఎస్ డెంటల్ కేర్ ప్రారంభం

-అందుబాటు ధరలో డెంటల్ సమస్యలకు చికిత్స
-అత్యాధునిక పద్ధతులతో సత్వర పరిష్కారం

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

కల్లూరు మండలం ఉల్చాల రోడ్డులోని వీకర్ సెక్షన్ కాలనీ సెంటర్లో ఎంఎస్‌డెంటల్ కేర్‌ను ప్రారంభించారు. ముఖ్యఅతిథులు నంద్యాల పార్లమెంట్ మహిళా అధ్యక్షులు కె. పార్వతమ్మ, డిఎస్‌పి మహ బూబ్‌బాష ప్రారం భించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో డెంటిస్ట్ డాక్టర్ వి .చైతన్య మాట్లాడుతూ పంటినొప్పి , తడిసినపళ్ళు, కావిటీస్, చిప్‌డ్‌టూత్ ,ప్రభావితమైన దంతాలు ,క్రాక్డ్ టూత్ ,చలికిసెన్సిటివ్ ,హైపర్‌డెంటియా ,వంకర పళ్ళు ,దంతాల మధ్య గ్యాప్ ,చిగుళ్ల సమస్యలు ,దంతాలను బిగించడం లేదా గ్రైండింగ్ చేయడం ,వివేక దంతాల సమస్యలు తదితర రకాల డెంటల్ సమస్యలకు అందరికీ అందుబాటు ధరలో అత్యాధునిక పరికరాలతో తమ క్లినిక్‌లో చికిత్స చేస్తామని తెలిపారు. ఈ అవకాశాన్ని నగర ప్రజలందరూ ఉపయోగించుకోవాలని కోరారు.



ఎంఎస్ డెంటల్ కేర్

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం

ప్రజాశక్తి- వెల్దుర్తి

వెల్దుర్తి మండలం మాదార్‌పురం గ్రామ సమీపంలో 44వ జాతీయ రహదారిలో శనివారం మధ్యాహ్నం లారీ మోటార్ బైక్‌ను ఢీకొన్న ఘటనలో ఇద్దరు దుర్మరణం చెందారు. నంద్యాల జిల్లా డోన్ పట్టణం టీచర్స్ కాలనీకి చెందిన పాలెం జయకుమార్(49), డేవిడ్ పాల్ (52) బైక్ పై కర్నూలు నుండి డోన్ కు వెళుతున్నారు. మాదార్ పురం దగ్గర వెనుక వైపు నుంచి వస్తున్న రాజస్థాన్‌కు చెందిన లారీ బైకును ఢీకొనడంతో బైక్ పైనుంచి కింద పడ్డారు. కింద పడ్డ వారిపై లారీ చక్రాలు వెళ్లడంతో మృత దేహాలు చిద్రమై ఒకరి తల మొండెం వేర్వేరు అయ్యాయి. బైకును 100 మీటర్ల మేర రోడ్డుపై లారీ ఈడ్చుకుంటూ వెళ్ళింది. లారీ డ్రైవర్ పరారయ్యాడు. విషయం తెలుసుకున్న హైవే పోలీసులు సంఘటనా స్థలికి చేరుకొని ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. వెల్దుర్తి ఎఎస్‌ఐ శివరామిరెడ్డి మృతదేహాలను పోస్టుమార్టం కోసం వెల్దుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆర్‌అండ్‌బిలో ప్రైవేట్ సర్వేయర్‌గా పనిచేస్తున్న పాలెం జయకుమార్ అతని మిత్రుడు అసిస్టెంట్ అయిన డేవిడ్‌పాల్‌తో కలిసి పనినిమిత్తం వెళ్లి తిరిగివస్తుండగా ప్రమాదం జరిగినట్లు సమాచారం. పాలెం జయ కుమార్‌కు భార్య గౌరీ, ఒక కుమారుడు, కూతురు ఉన్నారు. డేవిడ్ పాల్‌కు పెళ్లి కాలేదు. జయ కుమార్ భార్య గౌరీ ఫిర్యాదు మేరకు వెల్దుర్తి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



రోడ్డు ప్రమాదంలో హృదయవిదారక దృశ్యం



జయకుమార్ ఫైల్ ఫొటో

పేదల సంక్షేమం, అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

ఎంపి బస్తిపాటి నాగరాజు

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

పేదల సంక్షేమం, రాష్ట్రఅభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎంపి బస్తిపాటినాగరాజు అన్నారు. కర్నూలు మండలం పంచలింగాల గ్రామంలో ఎన్‌టిఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో లబ్ధిదారులకు ఇంటి వద్దకే వెళ్లి అందజేశారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందిస్తామన్నారు. ఇక రేపు సెలవు దినం కావడంతో పింఛన్ దారులకు ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం ఒక రోజు ముందే పంపిణీ చేసిందన్నారు. గ్రామ సర్పంచి మాధవి, ఉప సర్పంచి విష్ణువర్ధన్‌రెడ్డి, టిడిపి నాయకులు కృష్ణ యాదవ్, సచివాలయం ఉద్యోగులు పాల్గొన్నారు.



పింఛన్‌ను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి ం

ం ఎన్నికల్లో ఇచ్చిన హామీకి అనుగుణంగా పింఛన్ల పంపిణీ చేసి మాట నిలబెట్టుకున్న నాయకుడు ముఖ్యమంత్రి చంద్రబాబు అని కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి అన్నారు. కర్నూలు మండలం, దిన్నెదేవరపాడు గ్రామంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు వృద్ధులకు, వితంతువులకు, రూ.4000, వికలాంగులకు రూ.6000, డయాలసిస్ చేయించుకుంటున్న వారికి రూ.10000 చొప్పున పింఛన్లను అందజేసిన ఏకైక సిఎం చంద్రబాబు అని అన్నారు. పింఛన్ తీసుకున్న వారు ముఖ్యమంత్రికి, ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. గ్రామ సర్పంచి మాధవస్వామి, ఇన్చార్జ్ ఎంపిడిఒ అనురాధ, పంచాయతీ సెక్రెటరీ జాకీర్‌హుస్సేన్, గ్రామ టిడిపి నాయకులు మోహన్ రెడ్డి, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పత్తికొండ : టిడిపి ప్రభుత్వం ఎన్నికలకు ముందు సూపర్‌సిక్స్ పథకాల్లో ప్రజలకు ఇచ్చిన హామీల్లో భాగంగా ఎన్‌టిఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమం జాతరను తలపించే విధంగా రాష్ట్రవ్యాప్తంగా జరుగుతుందని పత్తికొండ ఎమ్మెల్యే కెఇ. శ్యామ్ కుమార్ అన్నారు. పత్తికొండ మండలం రామచంద్రపురం గ్రామంలో వృద్ధులు, వికలాంగులు, వితంతువులకు ఎన్నికల హామీలో భాగంగా పెంచిన పెన్షన్‌ను లబ్ధిదారుల ఇండ్ల వద్దకు వెళ్లి పంపిణీ చేశారు. ఇప్పుడు టిడిపి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీని నిలబెట్టుకుని పింఛన్‌ను లబ్ధిదారుల ఇంటి దగ్గర పంపిణీ చేశామన్నారు. టిడి ప్రభుత్వం కాదని, చేతల ప్రభుత్వంమని, రాబోయే రోజుల్లో సూపర్ సిక్స్ పథకాలన్నీ అమలు చేసి ప్రజల నమ్మకాన్ని విశ్వాసాన్ని నిలబెట్టుకుంటాం అన్నారు.



పింఛను పంపిణీ చేస్తున్న ఎంపీ బస్తిపాటి నాగరాజు

ఘనంగా గౌరు వెంకటరెడ్డి జన్మదిన వేడుకలు

పలుచోట్ల కేక్ కట్టింగులు, సేవా కార్యక్రమాలు

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

టిడిపి సీనియర్ నాయకులు నందికొట్కూరు ఇన్‌ఛార్జి గౌరు వెంకటరెడ్డి జన్మదిన వేడుకలను కర్నూలు నగరంలోని తన స్వగృహం వద్ద పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు కేక్ కట్ చేసి పూలమాలతో సత్కరించి ఘనంగా నిర్వహించారు. పాణ్యం నందికొట్కూరు నియోజకవర్గాలతో పాటు ఉమ్మడి జిల్లా నలుమూలల నుంచి పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు మాధవి నగర్ లోని వారి స్వగృహం వద్ద సందడి చేశారు. నంద్యాల పార్లమెంటు జిల్లా టిడిపి అధ్యక్షులు మల్లెల రాజశేఖర్ ఆధ్వర్యంలో గౌరు వెంకటరెడ్డి, గౌరు చరిత రెడ్డి దంపతులను గజమాలతో ఘనంగా సత్కరించారు.. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు పూల బొకేలు స్వీట్లు పళ్ళు వారికి అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కల్లూరు మండలం దొడ్డిపాడు గ్రామానికి చెందిన టిడిపి నాయకులు గౌరు వెంకట్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా వృద్ధులకు, వికలాంగులకు అనాథఆశ్రమంలో పాలు, బ్రెడ్ ప్యాకెట్స్ పంపిణీ చేశారు. పార్టీ నాయకులు, మైనార్టీ నాయకులు మహబూబ్ బాషా, కె.వెంకటప్ప, కె రామకృష్ణ, కె.మోహన్, టి ధనుంజయుడు ఎస్ కాసింబాష, మిన్నెల్లా, పి.దస్తగిరి పాల్గొన్నారు.



గౌరు దంపతులను గజమాలతో సత్కరిస్తున్న మల్లెల రాజశేఖర్



గౌరువెంకట్‌రెడ్డికి బర్త్‌డే కేక్‌ను తినిపిస్తున్న అభిమానులు



డోన్ ఎమ్మెల్యేగా కోట్లకు పుష్పగుచ్ఛం ఇస్తున్న డాక్టర్ శంకర్‌శర్మ, డాక్టర్ చంద్ర శేఖర్

డోన్ ఎమ్మెల్యేగా కోట్ల జయసూర్యప్రకాష్‌రెడ్డిని సీనియర్ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టర్ శంకర్‌శర్మ, కార్డియాలజిస్టు డాక్టర్ చంద్ర శేఖర్ శనివారం ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లా అభివృద్ధికి సహకరించాలని ఎమ్మెల్యే కోట్లను కోరారు. తమవంతు ప్రయత్నిస్తానని కోట్ల హామీ ఇచ్చారు.

రాష్ట్ర స్థాయిలో సత్తా చాటాలి

డాక్టర్ అరవింద్ రెడ్డి

ప్రజాశక్తి - కర్నూలు జిల్లాపరిషత్ : బాపట్ల జిల్లా నరసరావుపేటలో నిర్వహించనున్న 18వ రాష్ట్రస్థాయి ఫ్లోర్ బాల్ పోటీలలో జిల్లా క్రీడాకారులు చక్కటి ప్రతిభ కనపరచి విజేతలగా తిరిగి రావాలని కర్నూలు జిల్లా రోయింగ్ సంఘం అధ్యక్షుడు డాక్టర్ అరవింద్ రెడ్డి అన్నారు. ఫ్లోర్ బాల్ సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి ఫ్లోర్ బాల్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులకు డాక్టర్ అరవింద్ రెడ్డి, జిల్లా ఒలంపిక్ సంఘం సంయుక్త కార్యదర్శి పి.సునీల్ కుమార్, రాష్ట్ర యోగ సంఘం కార్యదర్శి ఎం.అవినాష్ శెట్టి క్రీడా దుస్తులను పంపిణీ చేశారు. డాక్టర్ అరవింద రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రస్థాయి పోటీలలో జిల్లా క్రీడాకారులు అంకిత భావంతో పాల్గొని పోటీల్లో తలపడి విజేతలుగా తిరిగి రావాలని కోరారు.

క్రమశిక్షణతో ఊరేగిస్తే బహుమతి

గణేష్ ఉత్సవ కమిటీలకు కోడుమూరు సిఐ తబ్రేజ్ వెల్లడి

ప్రజాశక్తి - కోడుమూరు రూరల్

క్రమశిక్షణతో, సాంద్రదాయ బద్ధంగా గణేష్ విగ్రహాలను ఊరేగించిన వారికి రూ.5000 బహుమతి ఇస్తామని కోడు మూరు సిఐ తబ్రేజ్ ప్రకటించారు. శనివారం సిఐ తబ్రేజ్ గణేష్ ఉత్సవ కమిటీ నియమాల గురించి వివరిస్తూ ఈ నజరానా ప్రకటించారు. వినాయక చవితి ఉత్సవాలు సాంప్రదాయబద్ధంగా క్రమశిక్షణతో మేళతాలాలతో విఘ్నేశ్వర ఊరేగింపు నిర్వహించిన వారికి రూ.5000 పారితోషకం ఇస్తామన్నారు. వినాయక చవితి ఉత్సవాలను కులమతాలకు అతీతంగా జరుపుకోవాలని సూచించారు. మద్యం సేవించి అనర్థాలు సృష్టిస్తే చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా సిఐ హెచ్చరించారు.



త్వరలో మహిళలకు 'ఉచిత బస్సు'

- కొత్త బస్సులను ప్రారంభించిన ఎమ్మెల్యే బీవీ

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు త్వరలో ఉచిత బస్సు ప్రయాణం అమలు చేస్తున్నట్లు ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయనాగేశ్వర రెడ్డి తెలిపారు. శనివారం స్థానిక ఆర్‌టిసి డిపోలో బెంగళూరు, శ్రీశైలం నడిపేందుకు రెండు కొత్త బస్సులను ఎమ్మెల్యే బీవీ చేతులమీదుగా ప్రారంభించారు. ఎమ్మెల్యే బీవీ స్వయంగా బస్సును నడిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎమ్మిగనూరు నుంచి కోడుమూరు మీదుగా కర్నూలు వరకు జాతీయ రహదారి ఏర్పాటు అవుతుందని తెలిపారు. ఎమ్మిగనూరు బస్టాండుకు కావాల్సిన ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ నివేదికను తయారు చేయాలని కోరారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో చర్చించినట్లు తెలిపారు. తన తండ్రి, మాజీ మంత్రి బీవీ.మోహన్ రెడ్డి ఏర్పాటు చేసిన ఆర్‌టిసి బస్టాండ్‌లో తాను కొత్త బస్సులను ప్రారంభించడం సంతోషంగా ఉందని చెప్పారు. ఆర్‌టిసి డిపో మేనేజర్ అమర్‌నాథ్, టిడిపి నాయకులు మాధవ్‌రావు దేశాయ్, కొండయ్య చౌదరి, రామదాసు గౌడ్, రంగస్వామి గౌడ్, ప్రతాప్, ఉరుకుందయ్య శెట్టి, శ్రీకాంత్, వాల్మీకి శంకరయ్య, తురేగల్ నజీర్ అహ్మద్, హుసేన్ పీరా, పార్లపల్లి మల్లికార్జున, మిన్నప్ప, దామ నరసింహులు, గట్టు అల్తాఫ్, బందేనవాజ్, జహంగీర్, బచ్చాల రంగన్న, కటారి రాజేంద్ర, అంజి, ఉమాదేవి, పద్మావతి, వడ్డే కృష్ణ, శిల్పి భాస్కర్, అమాన్, డీలర్ ఈరన్న, జగదీష్, రాఘవేంద్ర పాల్గొన్నారు.


బస్సును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బీవీ

వాడీవేడిగా కౌన్సిల్ సమావేశం

- 2 నెలలో రూ.5.50 కోట్లు నిధులు తెచ్చిన ఘనత ఎమ్మెల్యే బీవీదే

- టిడిపి కౌన్సిలర్లు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు


వాగ్వాదానికి దిగిన కౌన్సిలర్లు

ఎమ్మిగనూరు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం వాడీవేడిగా సాగింది. టిడిపి, వైసిపి సభ్యుల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. శనివారం మున్సిపల్ కౌన్సిల్ హాలులో ఛైర్మన్ డాక్టర్ రఘు అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం జరిగింది. అజెండా అంశాలను ఆమోదించారు. టిడిపి కౌన్సిల్ ఫ్లోర్ లీడర్ విజిఎ.దయాసాగర్ మాట్లాడుతూ... ఎమ్మిగనూరు మున్సిపల్ అభివృద్ధికి ఎమ్మెల్యే బీవీ.జయనాగేశ్వర రెడ్డి ప్రత్యేక శ్రద్ధ వహించి రెండున్నర నెలల్లో రూ.5.50 కోట్ల నిధులు తెచ్చారని తెలిపారు. పార్కుల అభివృద్ధి, డ్రెయినేజీల పూడికతీత, 15వ ఫైనాన్స్ నిధులు తెచ్చి అభివృద్ధి పనులు చేయిస్తున్నారని చెప్పారు. వైస్ ఛైర్మన్ నజీర్ అహ్మద్ మాట్లాడుతూ... అజెండా అంశాలను ఆమోదించే ముందు, బల్లలుపై దబదబ కొట్టే ముందు వైసిపి నుంచి గెలిచి టిడిపిలో చేరిన కౌన్సిలర్ రాజీనామా చేసి వెళితే బాగుంటుందని తెలిపారు. ఇందుకు కౌన్సిలర్ అమాన్ మాట్లాడుతూ... 'సరే సరే మిగతా మీ సభ్యులు జారిపోకుండా చూసుకోండి' అంటూ సెటైర్ వేశారు. కొంత మంది వైసిపి కౌన్సిలర్లు మాట్లాడుతూ... తమ వార్డుల్లో సమస్యలను పరిష్కరించాలని కోరారు. కమిషనర్ గంగిరెడ్డి, డిఇ మనోహర్ రెడ్డి, నీరజ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు, టిపిఒ గోపాల కృష్ణ, కౌన్సిలర్లు నీలకంఠ, రామదాసు గౌడ్, బోయ బజారి, నాగేశప్ప, శివప్రసాద్, వహీద్, ఇసాక్ పాల్గొన్నారు.

చెన్నకేశవ స్వామికి ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి- దేవనకొండ

మండలంలోని కప్పట్రాళ్ల రిజర్వ్ ఫారెస్టులో కొలువైన శ్రీదేవి, భూదేమి సమేత శ్రీలక్ష్మీ కౌలుట్ల చెన్నకేశవ స్వామి ఆలయంలో శ్రావణ మాసం చివరి శనివారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఛైర్మన్ హనుమంత రెడ్డి ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. స్వామివారిని, అమ్మవార్లను పల్లకి సేవ ఎదురు మండపం వరకు ఊరేగించారు. ట్రస్ట్ బోర్డు మెంబర్ వెంకటేశ్వర రెడ్డి, పెద్దలు హనుమంత రెడ్డి, కొలంట్ల కృష్ణ మూర్తి, జయన్న, పూజారులు పులికొండ స్వామి, ఆలయ ఉద్యోగులు సురేష్, రాజు పాల్గొన్నారు.

ప్రతి ఉద్యోగికీ విరమణ తప్పనిసరి

- ఆర్‌డిఒ రామలక్ష్మి

ప్రజాశక్తి- దేవనకొండ

ప్రతి ఉద్యోగికీ విరమణ తప్పనిసరి అని పత్తికొండ ఆర్‌డిఒ రామలక్ష్మి, డిప్యూటీ తహశీల్దార్ వెంకటేశ్వర్లు, రెవెన్యూ అసోసియేషన్ ప్రతినిధులు నాగరాజు తెలిపారు. శనివారం దేవనకొండ శ్రీలక్ష్మి రంగ కల్యాణ మండప ఆవరణలో విరమణ పొందిన తహశీల్దార్ జయన్నను రెవెన్యూ సిబ్బంది శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. సిరివెళ్ల, నంద్యాల, కల్లూరు, ఎమ్మిగనూరు, గోనెగండ్ల ప్రాంతాల్లో ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఆయనతో పని చేసిన సమయంలో ఉన్న అనుబంధాలను గుర్తు చేశారు.


మాట్లాడుతున్న డిప్యూటీ తహశీల్దార్ వెంకటేశ్వర్లు


వాదోపవాదాల మధ్య కౌన్సిల్ సమావేశం

- సమస్యలపై అధికారులను నిలదీసిన కౌన్సిలర్లు

ప్రజాశక్తి - ఆదోని

'వైసిపి కార్యాలయం కబ్జా' అంటూ, 'భూకబ్జాలకు, పేకాట స్థావరాలకు అడ్డా' అంటూ ఏర్పాటు చేసిన బ్యానర్లు తొలగించాలని మున్సిపల్ కౌన్సిల్‌లో వాడివేడిగా చర్చ సాగింది. ఆదోని మున్సిపల్ కౌన్సిల్ సమావేశం శనివారం మున్సిపల్ ఛైర్మన్ శాంత అధ్యక్షతన జరిగింది. నాలుగు గంటల పాటు సుదీర్ఘంగా వాదోపవాదాలతో చర్చలతో వాడివేడిగా జరిగింది. ఛైర్మన్ బోయ శాంత అధ్యక్షతన శనివారం ఉదయం 11 గంటలకు ప్రారంభమైన సమావేశం 3.30 గంటలకు ముగిసింది. స్థానిక సంస్థల కోటా నుంచి ఎంపికైన ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్ మొదటిసారిగా సమావేశానికి రావడంతో కౌన్సిలర్లు ఘనంగా సన్మానించారు. అలాగే ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి సైతం హాజరై సమస్యలను విన్నారు. మున్సిపల్ కౌన్సిల్ ఏర్పడి మూడేళ్లు పూర్తయినా ఇంతవరకు ఎన్నడూ ఈ రీతిలో సమావేశం జరగలేదని పలువురు చర్చించుకున్నారు. ఛైర్మన్‌తో పాటు ఇతర కౌన్సిలర్లు కూడా సమస్యలపై సుదీర్ఘంగా చర్చించారు. గతంలో మున్సిపల్ సమావేశం కేవలం అరగంటలో ముగిసేదని, అధికారులే తనకు చెప్పారని, సుదీర్ఘంగా మూడున్నర గంటలపాటు సమావేశం జరగడం ఆదోనిలో మార్పునకు, ప్రజలకు, ప్రజాప్రతినిధులకు స్వేచ్ఛ వచ్చిందని ఇదే నిదర్శనమని ఎమ్మెల్యే పార్థసారథి తెలిపారు. మూడేళ్ల పాటు వార్డులో కనీసం జాతీయ జెండాను ఆగస్టు, జనవరిలో ఎగరవేయడానికి కూడా అప్పటి ప్రభుత్వం, అధికారులు తనకు అవకాశం ఇవ్వలేదని 1వ వార్డు కౌన్సిలర్ పార్వతి పేర్కొన్నారు. కేవలం ఖర్చులు చెప్పడం కాదని, వాటి వివరాలు పూర్తిస్థాయిలో తెలియజేయాలని ఇండిపెండెంట్ కౌన్సిలర్ నాగరత్నమ్మ అధికారులను ప్రశ్నించారు. తన వార్డులో సమస్యల పరిష్కరించాలని ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోలేదని, సుమారు రూ.50 లక్షలతో పనులు చేపట్టాల్సి ఉన్నా ఎందుకు చేయడం లేదని 16వ వార్డు కౌన్సిలర్ హసీనా ప్రశ్నించారు. తన వార్డులో పైపులైన్ వేయాలని ఎన్నిసార్లు కోరినా పట్టించుకోలేదని ఫరిసా మొహల్లా కౌన్సిలర్ బేగం తెలిపారు. తనకు మూడేళ్ల నుంచి సమావేశంలో మాట్లాడే అవకాశం, వార్డులో వెళ్లే అవకాశం ఇవ్వలేదని, ఇప్పుడు తాను మాట్లాడుతున్నానని 35వ వార్డు కౌన్సిలర్ వెల్లాల లలితమ్మ వాపోయారు. అజెండాలోని 47 అంశాలను సుదీర్ఘంగా చర్చించి కొన్నింటిని వాయిదా వేయించడంలో, ప్రతి అంశంపై చర్చించి వాయిదా వేయించడంలోనూ, అధికారులతో వాగ్వాదం చేయడంలోనూ కౌన్సిలర్లు సందీప్ రెడ్డి, రఘునాథ్ రెడ్డి, వైస్ ఛైర్మన్ నరసింహులు త్రిపాత్రాభినయం పోషించారు. కొన్ని సమస్యలను ఛైర్మన్ పట్టించుకోలేదని వైస్ ఛైర్మన్ నరసింహులు చేసిన వ్యాఖ్యలపై ఛైర్మన్ శాంత తీవ్ర స్థాయిలోనే సమాధానం చెప్పారు. 'ఆదోనిలో ఏం జరుగుతుందో మీకు తెలుసా. కనీసం మీ వార్డులో జరుగుతున్న అభివృద్ధి గురించి అయినా మీకు తెలుసా' అని వైస్ ఛైర్మన్ నరసింహులు ప్రశ్నించడంతో.. తనకు అంతా తెలుసని, తనకు మాట్లాడే అవకాశం ఇవ్వలేదని, తాను మాట్లాడుతున్నా అంతా మీరే మాట్లాడుతున్నారని ఛైర్మన్ బోయ శాంత స్వరం పెంచారు. కౌన్సిల్‌లో ఎప్పుడూ అధికార, ప్రతిపక్ష పార్టీలు అధికారులతోనూ చేసే వాగ్వాదం ఈసారి మున్సిపాలిటీలో మెజార్టీ ఉన్న వైసిపి కౌన్సిలర్ల మధ్య జరగడం విశేషం. అరగంట సేపు పట్టణంలోని ఫ్లెక్సీలపై ఎమ్మెల్యే పార్థసారథికి, కౌన్సిలర్లకు, వైస్ ఛైర్మన్‌కు మధ్య జరిగింది. పట్టణంలో ఫ్లెక్సీలు తన ఫొటోతో వెలిస్తే అవి తనకు తెలిసి వెలిసినట్లేనని, ముమ్మాటికి ఆదోని వైసిపి కార్యాలయం కబ్జా అని, దీనిపై ఎంతకైనా సిద్ధమని తెలిపారు. వైస్ ఛైర్మన్ మహ్మద్ గౌస్, ఇన్‌ఛార్జీ కమిషనర్ అనుపమ, మున్సిపల్ ఇంజినీర్ ఇంతియాజ్, డిఇలు చలపతి రెడ్డి, రాజు నాయక్, ఎఇలు రాజశేఖర్ రెడ్డి, కృపాకర్, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ హరినాథ్, చంద్రమోహన్ ఉన్నారు.


బ్యానర్లు తొలగించాలని మహిళా కౌన్సిలర్ల బైఠాయింపు


అధికారులను చుట్టుముట్టిన వైసిపి కౌన్సిలర్లు

తోటి విద్యార్థికి చేయూత

ప్రజాశక్తి - ఆలూరు

తోటి విద్యార్థికి చేయూతనందించిన సంఘటన ఆలూరు మండలం అరికెర గ్రామంలో చోటు చేసుకుంది. మండలంలోని అరికెర అంబేద్కర్ బాలుర గురుకుల పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న చంద్రశేఖర్ తండ్రి సిద్ధప్ప గుండెపోటుతో మృతి చెందారు. విద్యార్థి చదువుకోవడానికి స్థోమత లేక 'ఆపేద్దాం' అనుకున్న సమయంలో తోటి విద్యార్థులు 'మేమున్నాం' అంటూ తమకు తోచినంత అందించి రూ.5,500 విద్యార్థి చంద్రశేఖర్‌కు ప్రిన్సిపల్ శ్రీనివాస రెడ్డి ఆధ్వర్యంలో శనివారం అందించారు. అలాగే ఉపాధ్యాయులు నరసింహులు కూడా తమకు తోచిన సహాయం అందించారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ... చిన్నతనం నుంచి సేవాభావం అలవాటు చేసుకోవాలని, చంద్రశేఖర్‌కు తోటి విద్యార్థులు అండగా నిలవడం గర్వించదగ్గ విషయమని తెలిపారు.


చేయూతనందిస్తున్న స్నేహితులు


నివాళులర్పిస్తున్న జర్నలిస్టులు

మాజీ సీనియర్ విలేకరి మృతి

- జర్నలిస్టుల నివాళి

ప్రజాశక్తి - గోనెగండ్ల

గోనెగండ్లలో మాజీ సీనియర్ విలేకరి, డాక్యుమెంట్ రైటర్ వడ్ల రంగస్వామి (80) శనివారం అనారోగ్యంతో మృతి చెందారు. గతంలో వడ్ల రంగస్వామి సుమారు 20 ఏళ్ల పాటు మండలంలో విలేకరిగా పనిచేశారు. మండలంలో తొలితరం విలేకరిగా పని చేసిన ఆయన మరోపక్క డాక్యుమెంట్ రైటర్‌గా సేవలందిస్తూ మండలంలో ప్రజల మన్ననలు పొందారు. సీనియర్ విలేకరులు మధు, రంగస్వామి, దండు ఖాజా, గౌస్ మొద్దీన్, కిరణ్, అక్బర్, ఈశ్వర్ ఆధ్వర్యంలో మండల విలేకరులు రంగస్వామి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. అహ్మద్ హుస్సేన్, బాబు నాయుడు, కట్టుబడి ఖలీల్, షఫీ, నరేష్ పాల్గొన్నారు.

వివిధ రాజకీయ పార్టీల నాయకుల నివాళి

వడ్ల రంగస్వామి గతంలో గోనెగండ్ల పంచాయతీ ఎన్నికల్లో రెండుసార్లు పోటీ చేసి గట్టి పోటీ ఇచ్చారు. ఆయన మృతి చెందడంతో టిడిపి మండల కన్వీనర్ నజీర్ సాహెబ్, నాయకులు బేతాళ బడేసా, తిరుపతయ్య నాయుడు, మాజీ సర్పంచి రహమతుల్లా, ఎంపిపి నసురుద్దీన్, మాజీ కోఆప్షన్ సభ్యులు బందే నవాజ్ నివాళులర్పించారు.

'బదినేహాల్'లో అదనంగా ట్యాంకు నిర్మించాలి

- సిపిఎం

ప్రజాశక్తి - కౌతాళం


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

మండలంలోని బదినేహాల్ గ్రామానికి మంచినీటి కోసం ట్యాంకు నిర్మించాలని సిపిఎం నాయకులు కోరారు. శనివారం సచివాలయం ముందు ధర్నా చేపట్టి, పంచాయతీ కార్యదర్శికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కన్వీనర్ ఈరన్న మాట్లాడారు. 30 ఏళ్ల క్రితం గ్రామ జనాభా 2 వేలలోపు ఉండేదని, ప్రస్తుతం 5 వేలు కావడంతో తాగునీటి సమస్య నెలకొందని తెలిపారు. ఉన్న ట్యాంకు నీళ్లు గ్రామానికి సరిపోవడం లేదని, అదనంగా మరో ట్యాంకు నిర్మించాలని కోరారు. హనవాళ్ ఎస్ఎస్ ట్యాంకు నుంచి సరఫరా అవుతున్న నీరు ప్రజలకు సరిపోవడం లేదని, గ్రామంలో బోర్లు వేయించి నీరందించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఉలిగయ్య, శంకర్, చాంద్ బాష పాల్గొన్నారు.

ఖనిజ సంపదతో అభివృద్ధికి బాటలు

- మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్ రాజశేఖర్

ప్రజాశక్తి - కౌతాళం

తుంగభద్ర నదిలో ఉన్న ఖనిజ సంపద అయిన ఇసుకతో సంపదను సృష్టించి అభివృద్ధికి బాటలు వేద్దామని మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్ రాజశేఖర్, పొల్యూషన్ ఇఇ ముని ప్రసాద్, ఇరిగేషన్ ఇఇ శైలేశ్వర్, రాయల్టీ ఇన్‌స్పెక్టర్ అహ్మద్ తెలిపారు. శనివారం మండలంలోని గుడికంబాలి, మురళి, నదీచాగి గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి, ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రభుత్వం తుంగభద్ర నదీతీరంలో ఇసుక రీచ్‌లను ఏర్పాటు చేయడానికి గ్రామసభల ద్వారా ప్రజల అభిప్రాయాలను సేకరిస్తోందని తెలిపారు. ప్రజల అభిప్రాయాలను ప్రభుత్వానికి, ఉన్నతాధికారులకు పంపుతాయని చెప్పారు.

ఉపాధి అవకాశాలు కల్పించాలి: ఆనంద్



గుడికంబాలి గ్రామంలో ఉపాధి పనుల్లేక బెంగళూరు, హైదరాబాద్, ముంబయి, గుంటూరు తదితర ప్రాంతాలకు వలస వెళ్తున్నారని ఆనంద్ తెలిపారు. ఇసుక రీచ్‌లో పెద్ద పెద్ద యంత్రాలతో కాకుండా లోడింగ్ కోసం ప్రజలకు ఉపాధి పని కల్పించాలని కోరారు. ఇసుక కోసం వచ్చే టిప్పర్లు, ట్రాక్టర్లు ఇష్టానుసారంగా వేగంతో వెళ్తున్నాయని తెలిపారు. గ్రామానికి చెందిన ఒక వ్యక్తి ప్రమాదానికి గురై అంగవైకల్యంతో జీవనం సాగిస్తున్నారని చెప్పారు. ఈ వ్యక్తికి ఇంతవరకు ఒక పైసా కూడా పరిహారం అందలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ వాహనాల ద్వారా జరిగే ప్రమాదాలకు రెవెన్యూ, మైనింగ్ అధికారులే బాధ్యత తీసుకోవాలని కోరారు.

రైతుల పంటలు కాపాడాలి : ఉరుకుందు



ఇసుక టిప్పర్లు, ట్రాక్టర్లు తిరగడం వల్ల దుమ్ము ధూళితో రైతులు సాగు చేసిన పంటలు దెబ్బతిని నష్టాల పాలవుతున్నారని ఉరుకుందు తెలిపారు. అప్పుల పాలయిన రైతులు అప్పులు తీర్చడానికి సుదూర ప్రాంతాలకు వలస వెళ్తున్నారని చెప్పారు. రైతులు సాగు చేసిన పంటలకు వాహనాల ద్వారా ఎలాంటి ఇబ్బందులూ కలుగకుండా అధికారులే బాధ్యత తీసుకోవాలన్నారు. లేకపోతే రైతులకు పూర్తిగా పంట నష్టపరిహారం అందేలా చూడాలని కోరారు.

పాడవుతున్న రోడ్లను బాగుచేయాలి : శ్రీనివాసులు



ఇసుక టిప్పర్లు, ట్రాక్టర్, లారీలు అధిక బరువుతో వెళ్లడంతో రోడ్లు పాడవుతున్నాయని శ్రీనివాసులు తెలిపారు. గుడికంబాళి నుంచి హాల్వి, కోసిగి, ఉరుకుంద, కౌతాళం రోడ్లు ఇప్పటికీ అధ్వానంగా మారాయని చెప్పారు. వాటిని బాగు చేయాలని కోరారు.

గ్రామాన్ని అభివృద్ధి చేయాలి : రమేష్



ఇసుక రీచ్‌ల నుంచి వచ్చే ఆదాయంతో గ్రామాలను అభివృద్ధి చేయాలని రమేష్ కోరారు. గ్రామంలో అంగన్వాడీలకు సొంత భవనాలు, మహిళలకు మురుగుదొడ్లు, ప్రజలకు తాగునీరు, రోడ్లు, డ్రెయినేజీలు, గ్రామానికి బస్సు సౌకర్యం, తదితర సౌకర్యాలు కల్పించాలని కోరారు. నదిచాగి గ్రామంలో ప్రజలు మాట్లాడుతూ... తుంగభద్ర నది వద్ద ఉన్న ఎత్తిపోతల పథకానికి మరమ్మతులు చేసి రైతులకు సాగునీరందించాలని కోరారు. ఇసుక వాహనాలు గ్రామంలో కాకుండా బయటి నుంచి రాకపోకలు కొనసాగించాలని తెలిపారు.

భూగర్భజలాలు ఎండిపోతున్నాయి

తుంగభద్ర నదిలో ఇసుక తవ్వకాలు లోతుగా చేపట్టడంతో భూగర్భ జలాలు ఎండిపోతున్నాయని రైతులు తెలిపారు. భూగర్భ జలాలు ఎండిపోవడంతో వ్యవసాయ బోర్లు నీరు రాక పంటలు ఎండిపోతున్నాయని, ఆర్థికంగా నష్టపోతున్నామని తెలిపారు. యంత్రాలతోకాకుండా కార్మికులతో ఒక మీటరు మించకుండా తవ్వకాలు చేపట్టాలని కోరారు.

ప్రజల సమస్యలు విన్న అధికారులు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. తహశీల్దార్ మల్లికార్జున స్వామి, ఆర్ఐ రాజశేఖర్, పొల్యూషన్ ఎఇ రామకృష్ణ, ఎల్ఎల్‌సి రంగస్వామి, సర్పంచి సిద్దేష్, గ్రామస్తులు బిజీ ఈరన్న, బసప్ప గౌడ్, నదీచాగి సర్పంచి మహేష్, ఎంపిటిసి లింగన్న గౌడ్, గ్రామ నాయకులు పకీరప్ప, ఆటో వలీ పాల్గొన్నారు.



గ్రామ సభలో మాట్లాడుతున్న మైనింగ్ డిడి రాజశేఖర్

చేతకాని వైసిపిని కాదని

టిడిపికి పట్టం కట్టారు...

- వైసిపి హయాంలో తప్పిదాలను గాడిలో పెడుతున్నాం


- ఎమ్మెల్యే బీవీ

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

గత వైసిపి ప్రభుత్వం చేతకాని తనం వల్ల ఆ పార్టీని ఇంటికి పంపి టిడిపికి పట్టం కట్టారని ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయనాగేశ్వర రెడ్డి తెలిపారు. శనివారం పట్టణంలోని 14వ వార్డు సున్నం బట్టి వీధిలో పింఛన్లు పంపిణీ చేశారు. అలాగే మండలంలోని కలగట్ల గ్రామంలో పింఛన్లు పంపిణీ చేశారు. కలగట్లలో టిడిపి నాయకులు కొండన్న గౌడ్ ఇంటికి వెళ్లి బీవీ అల్పాహారం తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండున్నర నెలలయిందని, ఇంతలోనే తమ ప్రభుత్వంపై వైసిపి గగ్గోలు పెడుతోందని విమర్శించారు. జగన్ మోహన్ రెడ్డి హయాంలో చేసిన అప్పులు, అవినీతి, అక్రమాలను సరి చేసి పాలనను గాడిలో పెట్టే పనిలో చంద్రబాబు ఉన్నారని తెలిపారు. మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి, డిఇ మనోహర్ రెడ్డి, నీరజ, టిడిపి నాయకులు 14వ వార్డు ఇన్‌ఛార్జీ బందేనవాజ్, సుందర్‌రాజు, కలీ ముల్లా, దయాసాగర్, మధుబాబు, దాదావలీ, రంగ స్వామి గౌడ్, రామదాసు గౌడ్, కొండయ్య చౌదరి, తురేగల్ నజీర్ అహ్మద్, సలాం, గట్టు అల్తాఫ్, బచ్చాల రంగన్న, దామ నరసింహులు, అమాన్, జహంగీర్, కటారి రాజేంద్ర, జయన్న, అంజి, గౌస్, మాబు, వడ్డే కృష్ణ, ఎరుకల సూర్యనారాయణ, పార్లపల్లి మల్లికార్జున, వాల్మీకి శంకర్, కొండన్న గౌడ్, శంకర్ గౌడ్, జగదీష్, రాఘవేంద్ర పాల్గొన్నారు. **ఆదోని** పురపాలక సంఘం పరిధిలోని గణేష్ సర్కిల్ జలగర్ వీధిలో లబ్ధిదారులకు పింఛను పంపిణీ చేశారు. ఆదోని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి, మున్సిపల్ ఇన్‌ఛార్జీ కమిషనర్ అనుపమ పాల్గొన్నారు. అలాగే పట్టణంలోని కార్వాన్ పేటలో మాజీ ఎమ్మెల్యే, టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు మీనాక్షి నాయుడు పింఛన్లు పంపిణీ చేశారు. నాయకులు బుద్దారెడ్డి, బాలాజీ ఉన్నారు. **దేవనకొండ** మండలంలోని తెర్నేకల్లు, దేవనకొండ గ్రామంలో జనసేన ఆలూరు ఇన్‌ఛార్జీ తెర్నేకల్ వెంకప్ప, జనసేన వీర మహిళ మండల నాయకులు సరోజమ్మ, మాజీ ఎంపిటిసి, టిడిపి నాయకులు ఆకుల వీరేష్ పింఛన్లు లబ్ధిదారులకు పంపిణీ చేశారు. టిడిపి నాయకులు బండి గింజల రంగన్న, మలకన్న, జనసైనికులు విశ్రాంత ప్రధానోపాధ్యాయులు ఉచ్చీరప్ప, జగదీష్, మక్బుల్, వడ్డే గోవిందు, నాగరాజు, తేజ, నరేష్, ప్రసాద్ పాల్గొన్నారు. **నందవరం** గ్రామంలో ఇంటింటికీ తిరిగి లబ్ధిదారులకు పింఛను అందించారు. టిడిపి నాయకులు గురురాజ్ దేశాయ్, జడ్‌పి మాజీ వైస్ ఛైర్మన్ పుష్పావతి, దేవల్ల లచ్చన్న ఉదయం 6 గంటల నుంచే పింఛన్లు పంపిణీ చేశారు. **పెద్దకడబూరు** మండలంలో తెలుగు రైతు రాష్ట్ర అధికార ప్రతినిధి నరవ రమాకాంత రెడ్డి ఆధ్వర్యంలో పింఛన్లు పంపిణీ చేశారు. టిడిపి ఎస్సీ సెల్ రాష్ట్ర నాయకులు ఏసేపు, తలారి అంజి, చిన్నకడబూరు నరసన్న, లక్ష్మన్న, రామాంజనేయులు, చిన్నతుంబళం నాయకులు నరసింహులు, హనుమంతు, నరసప్ప, శివ, జాలవాడి నాయకులు ముక్కన్న, కంబగిరి, హెచ్.మురవని నాయకులు సత్య, ఎంపిటిసి జనార్ధన్, బాపులదొడ్డి నర్సిరెడ్డి పాల్గొన్నారు. **మంత్రాలయం** మండలంలోని గ్రామాల్లో టిడిపి ఇరు గ్రూపుల వారు పోటాపోటీగా పింఛన్ల పంపిణీ చేపట్టారు. టిడిపి మండల అధ్యక్షులు పన్నగ వెంకటేష్ స్వామి ఆధ్వర్యంలో టిడిపి జిల్లా అధ్యక్షులు పాలకుర్తి తిక్కారెడ్డి తనయుడు, తెలుగు యువత జిల్లా ప్రధాన కార్యదర్శి పాలకుర్తి దివాకర్ మంత్రాలయం, చెట్నిహల్లి, మాధవరం, రచ్చుమర్రి, సుంకేశ్వరి గ్రామంలో పింఛన్లు పంపిణీ చేశారు. టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జీ ఎన్.రాఘవేంద్ర రెడ్డి చెట్నిహల్లి, సూగూరు గ్రామాల్లో పింఛన్లు పంపిణీ చేశారు. తెలుగు యువత జిల్లా మీడియా కోఆర్డినేటర్ విజయరామిరెడ్డి, వట్టెప్ప గారి చిన్న సుంకప్ప, వట్టెప్ప గారి నరసింహ, వనికె నాగరాజు, గణేకంటి రఘు, గణేకంటి రామకృష్ణ, మద్రి ఏబు, మాజీ జడ్‌పిటిసి లక్ష్మయ్య, మాలపల్లి మాజీ సర్పంచి చావిడి వెంకటేష్, ఎపివిబిఎస్ మండల కార్యదర్శి నాగేష్, మేకల మల్లేష్, డీజిల్ నల్లన్న, డీలర్ వీరేష్, వెంకట్రామి గౌడు, చాకలి నరసింహులు పాల్గొన్నారు.



ఎమ్మిగనూరులో పింఛను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బీవీ


ఆదోనిలో పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే పార్థసారథి


ఆదోనిలో పింఛన్లు పంపిణీ చేస్తున్న మీనాక్షినాయుడు


దేవనకొండలో...


మంత్రాలయంలో పింఛన్లు పంపిణీ చేస్తున్న నాయకులు



నందవరంలో పంపిణీ చేస్తున్న నాయకులు

94 శాతం పింఛన్లు పంపిణీ

- కనికరం చూపని అధికారులు

- 178 మందికి షోకాజ్ నోటీసులు

- సచివాలయ ఉద్యోగుల అసహనం

ప్రజాశక్తి - ఆదోని

యుద్ధప్రాతిపదికన పింఛన్లు పంపిణీ చేస్తూ బాధ్యతాయుతంగా విధులు నిర్వహిస్తున్న తమ పట్ల అధికారులు కనికరం చూపడం లేదని సచివాలయ ఉద్యోగులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఒకే రోజులో పింఛన్ల పంపిణీకి కృషి చేస్తున్న తమను మెచ్చుకోకుండా షోకాజ్ నోటీసులతో నిరుత్సాహ పరుస్తూ మానసిక క్షోభకు గురి చేయడం అధికారులకు తగదంటూ మండిపడుతున్నారు. ఆదోనిలో 28,657 మంది పింఛనుదారులకు రూ.12,22,21,000 పంపిణీ చేయనున్నారు. శనివారం సాయంత్రం ఐదు గంటల్లోపు దాదాపు 94 శాతం పింఛన్ల పంపిణీ జరిగినట్లు అధికారులు చెబుతున్నారు. కేటాయించిన ఏరియాలో ఒకరు, ఇద్దరు పింఛనుదారులు నగదు తీసుకోకుండా మిగిలినా సచివాలయ ఉద్యోగులను బాధ్యులు చేస్తూ షోకాజ్ నోటీసులు జారీ చేయడం శోచనీయమంటూ వాపోతున్నారు. ఉదయం 5 గంటల నుంచి పింఛన్ల పంపిణీ సాగింది. వర్షం కురుస్తున్నా లెక్కచేయకుండా సచివాలయ ఉద్యోగులు విధుల్లో పాల్గొన్నారు. వారికి కేటాయించిన ప్రాంతానికి వెళ్లి పింఛనుదారులకు నగదు పంపిణీ చేశారు. సాంకేతికపరమైన సమస్య తలెత్తినప్పటికీ ఓర్పుతో ఇంటింటికీ తిరుగుతూ లబ్ధిదారులకు నగదు ఇచ్చారు. ఆరోగ్యరీత్యా వేరే ప్రాంతాలకు వెళ్లడం, చనిపోవడం సమాచారం లేక ఇతరత్రా కారణాల వల్ల కొందరు పింఛన్లు తీసుకోలేని పరిస్థితి ఉంది. ఇంత ఇబ్బంది పడి పింఛన్లు పంపిణీ చేస్తున్న పరిగణనలోకి తీసుకోకుండా 100 శాతం పూర్తి చేయలేదని కారణం చూపి ఆదోని మున్సిపాలిటీ పరిధిలోని 178 మంది సచివాలయ ఉద్యోగులకు షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు మున్సిపల్ అధికారులు మెసేజ్‌లు పంపారు. ఇతర ఉద్యోగుల తరహాలో తమకు గౌరవం లేదని, చిన్న చూపు చూడడం తగదంటూ సచివాలయ ఉద్యోగులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అధికారులు వారి ఇబ్బందులను పరిగణనలోకి తీసుకొని షోకాజ్ నోటీసులను రద్దు చేయాలని కోరుతున్నారు.

ఆరోగ్యం, పోషణ ప్రోత్సాహానికి చర్యలు

- ఎంపిడిఒ సుహాసనమ్మ

ప్రజాశక్తి - హోళగుంద

నీతి అయోగ్ సూచనల మేరకు సమాజంలో ఆరోగ్యం, పోషణను ప్రోత్సహించేందుకు చర్యలు తీసుకోవాలని ఎంపిడిఒ సుహాసనమ్మ తెలిపారు. శనివారం సంపూర్ణత అభియాన్‌లో భాగంగా జాతీయ పోషణ వారోత్సవం నిర్వహించారు. వివిధ శాఖల అధికారులతో ఎంపిడిఒ కార్యాలయంలోని మీటింగ్ హాలులో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ సుహాసనమ్మ, అస్పిరేషనల్ బ్లాక్ కోఆర్డినేటర్ రవిశంకర్ మాట్లాడారు. ఆరోగ్య సిబ్బంది, అంగన్వాడీ సిబ్బంది వారం రోజుల పాటు శక్తి వంచన లేకుండా కృషి చేయాలని తెలిపారు. మెడికల్ ఆఫీసర్ న్యూటన్, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ శోభారాణి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపిడిఒ



బస్సును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

ఆళ్లగడ్డ-మంత్రాలయం బస్సు సర్వీస్ ప్రారంభం

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

ఆళ్లగడ్డ డిపో నుంచి మంత్రాలయానికి ఏర్పాటు చేసిన నూతన ఎక్స్ప్రెస్ బస్సు సర్వీసును ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎక్కడైనా సర్వీసులు లేకుంటే కచ్చితంగా తన దృష్టికి తీసుకొని రావాలని, ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా ప్రతి ఒక్క ఊరికి బస్ సర్వీస్‌ను కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ రాజశేఖర్ రెడ్డి, కౌన్సిలర్ హుస్సేన్ బాషా, రంగనాయకులు తదితరులు పాల్గొన్నారు.

మంచి మార్గానికి దగ్గర దారి భక్తి

ప్రజాశక్తి - బనగానపల్లె

మంచి మార్గానికి దగ్గరిదారి భక్తి అని శ్రీ జే కే ఆర్ సంక్షేమ సంఘం అధ్యక్షులు జెఎస్ఎస్ బ్రహ్మానంద ఆచారి పేర్కొన్నారు. శనివారం మండలంలోని పలుకూరు గ్రామంలో రామాలయంలో పూజారి శ్రీనివాసులు ఆధ్వర్యంలో భక్తి భావన పై సదస్సు నిర్వహించారు. భజన మండలి సభ్యులు బాల హనుమంతు, కేఈ వెంకటసుబ్బయ్య గౌడ్ లనుసన్మానించారు. ఈ సందర్భంగా జే ఎస్ ఎస్ బ్రహ్మానంద చారి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ భక్తి మార్గంలో నడవాలన్నారు తోటి వారికి సహాయం చేసే గుణాన్ని అలవర్చుకోవాలన్నారు మానవసేవయే మాధవసేవ అన్నారు అన్నదానం నిర్వహించారు ఈ కార్యక్రమంలో భజన మండలి సభ్యులు పాల్గొన్నారు

వేంపెంటను నిరంతరం వైద్యుల పర్యవేక్షణలో ఉంచాలి

- జిల్లా కలెక్టర్‌కు మాజీ ఎమ్మెల్యే లబ్బి వెంకటస్వామి వినతి

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్


వేంపెంట గ్రామన్ని నిరంతరం వైద్యుల పర్యవేక్షణలో ఉంచాలని వైసిపీ నాయకులు, మాజీ ఎమ్మెల్యే లబ్బి వెంకటస్వామి జిల్లా కలెక్టర్ జి.రాజకుమారిని కోరారు. పాములపాడు మండలం వేంపెంట గ్రామంలో అతిసారాతో బోయ లక్ష్మీదేవి మృతి చెందిన విషయమై మాజీ ఎమ్మెల్యే లబ్బి వెంకటస్వామి శనివారం జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం 10 లక్షల రూపాయలు నష్టపరిహారం అందించాలని, గ్రామంలో ఉచిత మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటుచేయాలని కోరారు. వేంపెంట గ్రామానికి వెలుగోడు రిజర్వాయర్ నుండి త్రాగునీటి కొరకు పైపులైన్ ఏర్పాటు చేయాలని, గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.



ఈ-పంట నమోదును పూర్తి చేయాలి : కలెక్టర్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ఈ-పంట నమోదు ప్రక్రియను వేగవంతం చేసి ఈ నెల 15లోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ జి.రాజుకుమారి వ్యవసాయ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని ఛాంబర్‌లో ఈ-పంట నమోదుపై జెసి సి.విష్ణు చరణ్‌తో కలిసి జూమ్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వ్యవసాయ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్రస్థాయిలో నంద్యాల జిల్లా 20వ స్థానంలో ఉందని, నిర్ణీత కాల వ్యవధి కంటే ముందుగానే పూర్తిచేసి ఎగువ స్థానంలో ఉంచేందుకు కృషి చేయాలన్నారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి వైవి మురళీ కృష్ణ, మండల వ్యవసాయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



క్షేత్రస్థాయి వ్యవసాయ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ లో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

ప్రభుత్వ ఉద్యోగికి విరమణ తప్పని సరి

- ఈఈ వెంకట సురేష్ బాబు

ప్రజాశక్తి - అవుకు

ప్రభుత్వ ఉద్యోగి విరమణ చేయడం తప్పనిసరి అని ఈఈ వెంకట సురేష్ బాబు, విశ్రాంత ఎస్ఇ చంగయ్యకుమార్‌లు అన్నారు. శనివారం ఎస్ఆర్‌బీసీ డివిజన్ పరిధిలోని సబ్ డివిజన్-1లో పనిచేసిన ఏఈ చల్లా శిఖామణి విరమణ చేశారు. సబ్ డివిజన్ -1 డీఈ కొండన్న ఆద్వర్యంలో శిఖామణికి డివిజన్, సబ్ డివిజన్ సిబ్బంది, బంధుమిత్రులు దుశ్శాలువాలు కప్పి పూలమాలలతో ఘనంగా సన్మానం చేశారు. చల్లా శిఖామణి సేవలను ఈఈ వెంకట సురేష్ బాబు, ఏ ఈ లు డీఈలు సుధాకర్,జయప్రకాశ్ రెడ్డి, కొండన్న, బాబుజీ కొనియాడారు. కార్యక్రమంలో హెచ్ డీ శ్రీనివాసులు, సూపరింటెండెంట్ బజారప్ప, ఏటీఎంలు చంద్రశేఖర్, హరిబాబు, రామాంజనేయులు, రాంబాబు, సీనియర్ అసిస్టెంట్‌లు భూపాల్ రెడ్డి, శ్రీరాములు, నాగేష్, గుంపుల వెంకటేశ్వర్లు,నరసప్ప, అమర్ బాబు తదితరులు పాల్గొన్నారు.



విరమణ పొందిన శికామణిని సన్మానిస్తున్న అధికారుల బృందం

ప్రజలకు ఎల్లప్పుడూ అండగా ఉంటాం

- శిల్ప మహిళా సహకార చైర్మన్‌న్ నాగిని రవి సింగారెడ్డి

ప్రజాశక్తి - నంద్యాల అర్బన్

పేదింటి మహిళల ఆర్థిక బలోపేతానికి శిల్పా మహిళా సహకార్ బ్యాంక్ కృషి చేస్తుందని శిల్పా సహకార సంఘం చైర్ పర్సన్ నాగిని రవి సింగారెడ్డి తెలిపారు. శనివారం నంద్యాలలోని శిల్పా సేవాసమితి కార్యాలయంలో శిల్పా సహకార సంఘం ద్వారా 131 మంది మహిళలకు దాదాపుగా 20 లక్షల రూపాయల చెక్‌లను ఆమె అందజేశారు. మహిళలు రుణాలను సద్వినియోగం చేసుకోవాలని, ఆర్థికంగా అభివృద్ధి చెందాలని కోరారు. నంద్యాల ప్రజలందరికీ శిల్పా కుటుంబం ఎప్పుడూ తోడుగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో మహిళా బ్యాంక్ డైరెక్టర్ పూర్ణిమ మహిళా బ్యాంక్ మేనేజర్ హరి లీల, సేవా సమితి సభ్యులు మహిళలు పాల్గొన్నారు.



మహిళలకు చెక్కులు పంపిణీ చేస్తున్న మహిళా సహకార చైర్పర్సన్ నాగిని రవి సింగారెడ్డి



అంతర్ జిల్లా దొంగలు అరెస్ట్ : డిఎస్‌పి

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

నంద్యాల తాలూకా పోలీసు స్టేషన్ పరధిలో జరిగిన రెండు దొంగతనం కేసులలో ముగ్గురు అంతర్ జిల్లా దొంగలను అరెస్ట్ చేసినట్లు నంద్యాల డిఎస్పి యోగేంద్ర తెలిపారు. శనివారం నంద్యాల డిఎస్పి కార్యాలయంలో నిర్వహించిన విలేఖరుల సమావేశంలో డిఎస్‌పి మాట్లాడుతూ సాయిజిత్ కాలనీ, రెడ్డిస్ కాలనీలలో జరిగిన దొంగతనం కేసులో చిత్తూరు జిల్లా శెట్టిపల్లి గ్రామానికి చెందిన గల్లా హేమచంద్ర, తిరుపతికి చెందిన షేక్ మస్తాన్, కర్ణాటక రాష్ట్రం బెంగళూరుకు చెందిన పాల్ రాజ్ ఆంటోని ఆల్బర్ట్‌లను అరెస్ట్ చేసినట్లు తెలిపారు. వీరి వద్ద నుండి సంసాంగ్ కీ పాడ్ ఫోన్, ఒక బంగారు ఉంగరం, జత కమ్మలు, రెండు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. ఈ కేసులో మరో ఇద్దరు నిందితులు పరారీలో ఉన్నారని, వారిని కూడా త్వరలో అరెస్ట్ చేస్తామన్నారు. ఈ కేసును చేధించి నిందితులను అరెస్ట్ చేయడంలో కృషి చేసిన సీఐలను, పోలీసు సిబ్బందిని ఆయన అభినందించారు.

పాఠశాలలను పరిశీలించిన మండల స్పెషల్ ఆఫీసర్

ప్రజాశక్తి - కొలిమిగుండ్ల

కొలిమిగుండ్లలోనే కస్తూర్బా గాంధీ విద్యాలయాన్ని, ఎపి మోడల్ స్కూల్‌ను మండల స్పెషల్ ఆఫీసర్ శ్రీనివాసయాదవ్ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాల స్పెషల్ ఆఫీసర్ (ఎస్ఓ)లక్ష్మీ సరోజ మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ సంజీవరెడ్డిని పాఠశాలలకు కావలసిన సదుపాయాల గురించి అడిగి తెలుసుకున్నారు. కస్తూర్బా పాఠశాలలో గ్రౌండ్ లెవెలింగ్, వాటర్ ట్యాంకు మెట్లు, కిటికీలకు జాలర్ సౌకర్యం కల్పించాలని తెలిపారు. మోడల్ స్కూల్ నందు ప్రిన్సిపల్ సంజీవరెడ్డి విద్యార్థులు ఆటలాడేందుకు గ్రౌండ్ సౌకర్యంగా లేదని చెప్పారు. కార్యక్రమంలో ఇంచార్జ్ ఎంపీడీవో తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ప్రత్యేక అధికారిగా పోలా భాస్కర్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

ప్రభుత్వ పథకాల అమలు తీరును పరిశీలించేందుకు రాష్ట్ర మైనార్టీ వెల్ఫేర్ డిపార్ట్మెంట్ సెక్రటరీ పోలా భాస్కర్‌ను జిల్లా స్పెషల్ ఆఫీసర్‌గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న పలు సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను పర్యవేక్షించేందుకు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాలకు పర్యవేక్షణకు ప్రత్యేక అధికారులను నియమించింది.

రాజకీయ దార్శనీకుడు సిఎం చంద్రబాబు

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తన రాజకీయ ప్రస్థానంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసి 30 సంవత్సరాల అయిన సందర్భంగా ఆళ్లగడ్డకు చెందిన చిత్రకారుడు విజయ్ తన కుంచెతో చంద్రబాబు చిత్రాన్ని స్వయంగా రూపొందించారు.

విజన్ 2020ని దశాబ్దం క్రితమే రూపొందించిన దార్శనికుడు చంద్రబాబు అని విజయ్ పేర్కొన్నారు.

భవిష్యత్తు పరిస్థితులను ముందుగానే అంచనా వేసే చతురుడని కొనియాడారు.



చిత్రకారుడు విజయ్ గీసిన చిత్రం



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న రాష్ట్ర మంత్రి ఎన్ఎండి ఫరూక్

3 నుండి 'పొలం పిలుస్తోంది'

- విజయవంతం చేయాలి : మంత్రి ఫరూక్

ప్రజాశక్తి, నంద్యాల కలెక్టరేట్

ఈ నెల 3 నుండి గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ అన్నారు. శనివారం నంద్యాలలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో గోస్పాడు ఏఓ స్వప్నికతో కలిసి మంత్రి ఫరూక్ పొలం పిలుస్తోంది కార్యక్రమం గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రతి మంగళ, బుధవారం వ్యవసాయ అధికారులు రైతుల వద్దకు వెళ్లి నూతన పద్ధతులు, సేంద్రీయ, ఆధునిక వ్యవసాయ సాగు పద్ధతులు, పంటల మార్పిడి, ఎరువుల వాడకం తదితర వాటిపై వివరించి రైతులకు అవగాహన కల్పిస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులతో చీడ పీడల నివారణ

- జిల్లా వ్యవసాయ అధికారి వై. మురళీ కృష్ణ

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

జిల్లాలో ఖరీఫ్‌లో రైతులు సాగు చేసిన పంటలు వివిధ దశల్లో ఉన్నాయని, అధిక వర్షాలకు గురయితే యాజమాన్య పద్ధతులు పాటిస్తూ చీడ పీడలను నివారించుకోవచ్చని జిల్లా వ్యవసాయ అధికారి వై.మురళీ కృష్ణ తెలిపారు. జిల్లాలో అధిక వర్షాలు పడుతున్న నేపథ్యంలో రైతులు సూచనలు, సలహాలు, పద్ధతులు పాటించాలని పలు వివరాలను పత్రికలకు శనివారం ప్రకటన విడుదల చేశారు. అపరాలు, కంది, మినుము, సోయాబీన్, వరి పొలాల్లో నీరు నిలబడకుండా పాదుల ద్వారా నీరు తీసివేయాలని తెలిపారు. పొలం ఆరిన వెంటనే అంతర సేద్యం చేసుకోవాలని పేర్కొన్నారు. సిఫారసు చేసిన ఎరువులను పైపాటుగా సూచించిన విధంగా వేసుకోవాని తెలిపారు. పొలంలో వరి నారు మడిలో నిలిచిన నీటిని వీలైనంత తొందరగా బయటకు తీసివేసి పొలం అరబెట్టాలని పేర్కొన్నారు. ఎకరానికి 20 కిలోల యూరియా, 10 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ ఎరువులు పైపాటుగా వేయాలని సూచించారు. తెగుళ్ళు వ్యాపించకుండా ముందు జాగ్రత్తగా కార్బెండజిం మందు 1.0 గ్రా/లీ నీటికి చొప్పున పిచికారి చేయాలని తెలిపారు.

కమలపురి సర్పంచి భర్త మృతి

ప్రజాశక్తి - సంజామల

సంజామల మండలం కమలపురి గ్రామానికి చెందిన సర్పంచ్ విజయలక్ష్మి భర్త చంద్రశేఖర్ రెడ్డి శనివారం తెల్లవారుజామున హైదరాబాద్‌లోని కేర్ హాస్పిటల్‌లో మృతి చెందారు. ఆయన మృతి టిడిపికి తీరని లోటని గ్రామ నాయకులు, కార్యకర్తలు తెలిపారు.

ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనది : ఎంఇఒ

ప్రజాశక్తి - బేతంచర్ల

సమాజంలో అత్యంతమైనది పవిత్రమైనది ఉపాధ్యాయ వృత్తి అని బేతంచెర్ల ఎంఇఒ సోమశేఖర్ అన్నారు. శనివారం అమ్మవారి శాల నందు బేతంచెర్ల ఎంఈఓ-2 జనార్దన్ గౌడ్ విరమణ సన్మాన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, తోటి మిత్రులు జనార్దన్ గౌడ్‌ను శాలువాలతో, పూలమాలతో సత్కరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వర్లు, పుల్లయ్య, పాపారాయుడు, కృష్ణారెడ్డి, హరికృష్ణ, వెంకటేశ్వర నాయక్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీశైలానికి భారీగా వరద ప్రవాహం

- 10 గేట్ల ద్వారా దిగువకు నీటి విడుదల



ప్రజాశక్తి - శ్రీశైలం ప్రాజెక్టు

శ్రీశైలం జలాశయానికి ఎగువ పరివాహక ప్రాంతం నుండి కర్ణాటక, మహారాష్ట్రలో కురుస్తున్న భారీ వర్షాల వలన భారీగా వరద నీటి ప్రవాహం చేరుకుంటుంది. శనివారం సాయంత్రం 6 గంటలకు ఎగువ జూరాల నుండి 3,25,569 క్యూసెక్కులు, సుంకేసుల ద్వారా 912 క్యూసెక్కుల నీటితో కలిపి 3,26,481 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతున్నాయి. దీంతో జలాశయం నుండి 10 గేట్లలో 2 గేట్లు పది అడుగులు, 8 గేట్లు 12 అడుగులు మేర ఎత్తు ఎత్తి దిగువకు సాగర్ 3,12,390 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. అదే సమయానికి జలాశయం నీటిమట్టం 885 అడుగుల పూర్తిస్థాయికి చేరుకుంది. నీటి నిలువ సామర్థ్యం 215.80 పూర్తి స్థాయికి చేరుకుంది. రెండు విద్యుత్తు కేంద్రాల్లో యధావిధిగా విద్యుత్ ఉత్పత్తిని కొనసాగిస్తున్నారు. గడిచిన 24 గంటల్లో ఎడమ గట్టు భూగర్భ జల విద్యుత్తు కేంద్రంలో 16.768 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తిని చేస్తూ 37,850 క్యూసెక్కులు నీటితో, కుడిగట్టు విద్యుత్తు కేంద్రంలో 14.8 64 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తిని చేస్తూ 26,640 క్యూసెక్కుల నీటితో మొత్తం దిగువ నాగార్జునసాగర్‌కు 68,109 క్యూసెక్కుకులను విడుదల చేస్తున్నారు. అలాగే శ్రీశైలం బ్యాక్ వాటర్ నుండి పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్‌కి 30,000, హంద్రీ నీవా సుజల స్రవంతికి 1407, మహాత్మా గాంధీ కల్వకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్‌కు 2,400 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

కౌలు రైతు కుటుంబాన్ని దుకోవాలి

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

మండలంలోని చిన్న కందుకూరు వద్ద ఎనిమిది ఎకరాలు కౌలుకు తీసుకుని మొక్కజొన్న సాగు చేసి నకిలీ విత్తనాల వల్ల తీవ్రంగా నష్టపోయిన వికలాంగ కౌలు రైతు రాజశేఖర్ కుటుంబానికి ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని ఎపి రైతు సంఘం జిల్లా కమిటీ సహాయ కార్యదర్శి టి.రామచంద్రుడు శనివారం ఓ ప్రకటనలో కోరారు. అడ్వంటా కంపెనీకి చెందిన పిఎసి-751 రకం మొక్కజొన్న విత్తనాలను ఆళ్లగడ్డ పట్టణంలోని మన గ్రోమోర్ సెంటర్‌లో కౌలు రైతు రాజశేఖర్, మల్లేశ్వరి దంపతులు కొనుగోలు చేశారన్నారు. మొత్తం 8 ఎకరాలకు సుమారు 6 లక్షల రూపాయల వరకు పెట్టుబడి పెట్టి నకిలీ విత్తనాల వల్ల కంకులకు మొక్కజొన్న గింజలు లేక తీవ్రంగా నష్టపోయారన్నారు. నష్టపోయిన రైతు విషయం అంగడి యజమానితో చెప్పుకోగా అడ్వాంటే కంపెనీ వాళ్లు పంటను పరిశీలించేందుకు రావడానికి నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. వ్యవసాయ అధికారులు వెంటనే జోక్యం చేసుకుని నష్టపోయిన మొక్కజొన్న పంటను పరిశీలించి నివేదికలు ప్రభుత్వానికి పంపి రైతుకు నష్టపరిహారం ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. నకిలీ విత్తనాలు విక్రయించిన కంపెనీ పైన చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఉద్యోగులకు పదవీ విరమణ సర్వసాధారణం

ప్రజాశక్తి - రుద్రవరం

ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి విరమణ సర్వసాధారణమని రుద్రవరం వైద్యాధికారి శ్రావణి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సిహెచ్ఒగా విధులు నిర్వహిస్తున్న మెలకమ్మ విరమణ పొందారు. ఈ సందర్భంగా ఆమెకు ఘనంగా సన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమెను వైద్య సిబ్బంది, బంధువులు, స్నేహితులు ఘనంగా సన్మానించారు. అనంతరం పలువురు వక్తలు మాట్లాడుతూ మెలకమ్మ ఆరోగ్య కేంద్రంలో సిహెచ్ఓగా తన అమూల్య సేవలను ప్రజలకు దరి చేరవేయడంలో నిరంతరం శ్రమించడం జరిగిందన్నారు. విరమణ అనంతరం ఆమె మిగిలిన జీవితాన్ని ఆరోగ్యంగా అందంగా జీవించాలని పలువురు కోరారు. కార్యక్రమంలో ఆరోగ్య కేంద్రం సిబ్బంది పలువురు ఆశాలు పెద్దలు పాల్గొన్నారు.



వీరబ్రహ్మేంద్రస్వామి మఠంలో హారతి తీసుకుంటున్న ఎమ్మెల్యే

విగ్రహ ప్రతిష్ట కోసం భూమి పూజ

ప్రజాశక్తి - మిడుతూరు

మండల కేంద్రంలోని గ్రామ శివారులో ఉన్న శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి మఠం దగ్గర పంచముఖి ఆంజనేయ స్వామి విగ్రహం ఏర్పాటుకు శనివారం భూమి పూజ నిర్వహించారు. భూమి పూజలో నందికొట్కూరు శాసన సభ్యులు టిడిపి మండల నాయకుడు ఖాతా రమేష్ రెడ్డి, సుంకేసుల వేద పండితులు మల్లికార్జున స్వామి, గ్రామ పెద్దలు టిడిపి నాయకులు ఖాతా రామచంద్ర రెడ్డి పాల్గొన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ వీరబ్రహ్మేంద్రస్వామి మఠం వద్ద దాదాపు రూ. 50 లక్షలతో పంచముఖి ఆంజనేయ స్వామి విగ్రహం దాదాపు 70 నుంచి 80 అడుగులు తయారు చేయించాలని అన్నారు. కార్యక్రమంలో వేద పండితుల సుబ్రమణ్యం శాస్త్రి, కృష్ణమోహన్, బన్నూరు నాగిరెడ్డి, కటకం సత్యమయ్య, వెంకటేశ్వర్లు, లక్ష్మీనారాయణ, కిష్టన్న గౌడ్ పాల్గొన్నారు.

గౌరు వెంకట్ రెడ్డి పుట్టినరోజు వేడుకలు



ప్రజాశక్తి - మిడుతూరు

మండలంలోని నాగులుటి గ్రామానికి చెందిన రవీంద్రబాబు నందికొట్కూరు నియోజకవర్గం సమన్వయకర్త గౌరు వెంకట్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా శనివారం ఆయనకు పుష్పగుచ్ఛమిచ్చి శుభాకాంక్షలు తెలిపారు. గౌరు వెంకట్ రెడ్డి ఇలాంటి పుట్టినరోజులు ఎన్నో జరుపుకోవాలని కోరారు.

పగిడ్యాల : నందికొట్కూరు టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జీ గౌరు వెంకట్ రెడ్డి పుట్టిన రోజు వేడుకలను మండలంలోని ప్రాతకోట గ్రామంలో శనివారం ఘనంగా నిర్వహించారు. గ్రామ టిడిపి నాయకులు మసీదుల సుబాన్, నాగశేషులు ఆధ్వర్యంలో టిడిపి నాయకులు కేకులు కట్ చేసి ఒకరికొకరు తినిపించుకొని శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మా బాష, ఇస్మాయిల్, ఖజమీయా, ఖలీల్, దస్తగిరి, అశిఫ్, ఇస్మాయిల్, జాలి తదితరులు పాల్గొన్నారు.

పవన్ కళ్యాణ్‌పుట్టినరోజున మొక్కలు నాటిన అభిమానులు

ప్రజాశక్తి-కర్నూలు అగ్రికల్చర్

ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ జన్మదినవేడుకలు కరూలు నగరంలో రాయలసీమ కన్వీనర్ పవన్ కుమార్ ఆధ్వర్యంలో జరుగుతున్న వేడుకలో భాగంగా రెండవరోజు కర్నూలులో గ్రీన్ ఆంధ్ర కార్యక్రమంలో నారాయణ పాఠశాల, నెహ్రూ మెమోరియల్ ప్రభుత్వ పాఠశాల, ప్రైమరీ ప్రభుత్వ పాఠశాలలోఉపాధ్యాలు , చిన్నారులతో కలిసి మొక్కలు నాటారు. రాయలసీమ కన్వీనర్ పవన్ కుమార్ మాట్లాడుతూ గతంలో ఎప్పుడు చేయని విధంగా తన జన్మదిన వేడుకను కూడా ఒక మంచి కార్యక్రమం గ్రీన్‌ఆంధ్ర అన్న పేరుతో ప్రతిఒకరు మొక్కలు నాటాలని రాష్ట్రాన్ని 50శాతం పచ్చదనంగా కాలుష్యంలేని ఆంధ్రప్రదేశ్ గా ఉండాలని పవన్ కళ్యాణ్ పిలుపునిచ్చారన్నారు. అందులో భాగంగా శనివారం ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. మొక్కలు నాటటం ఒక ఆనవయితీగా మన పిల్లలకు నేర్పలాన్నారు. మొక్కలు నాటటం వల్ల ఎన్ని లాభాలు కలయిగుతాయో తెలియచేసి ఉత్సాహ పరిచి రాబోవు తరానికి కాలుష్యం లేని ఆంధ్రప్రదేశ్‌ను అందచేద్దా, మొక్కలను పెంచటం సంరక్షించటం అలవాటుగా తీసుకోవాలని తెలిపారు. జనసేనా నాయకులు కరుణాకర్,తదితరులు పాల్గొన్నారు.



మండలంలో ఎడతెరిపిలేని వర్షం



కర్నూలు గుంటూరు రహదారిపై పడ్డ చెట్టును తొలగిస్తున్న డీఎస్పీ రామంజి నాయక్



సీసీ రోడ్లపై నిలిచిన వర్షపు నీళ్లు

ప్రజాశక్తి - ఆత్మకూర్

ఆత్మకూరు మండలంలో శుక్రవారం అర్ధరాత్రి నుండి ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తుండడంతో అనేక గ్రామాల చెరువులు వర్షపు నీళ్లతో కళకళలాడుతున్నాయి. ప్రధానంగా సిద్దాపురం చెరువుకు పది అడుగుల మేర వర్షం నీరు రావడం పట్ల ఈ చెరువు కింద ఉన్న రైతులు హర్షం వ్యక్త పరుస్తున్నారు. మరోవైపు ఎడతెరిపిలేని వర్షంతో ఇప్పటికే వేసిన పంట పొలాల్లో వర్షపునీరు చేరింది. మరోసారి రైతులు పంటలు నష్టపోయే పరిస్థితి కనిపిస్తుంది. ఆత్మకూరు మున్సిపాలిటీ పరిధిలోని ప్రతి వీధిలోను సీసీ రోడ్లు కాల్వలను తలపిస్తున్నాయి. కర్నూలు-గుంటూరు రహదారిపై భారీ వృక్షం కూలడంతో ట్రాఫిక్ జామ్ అయింది. ఆత్మకూరు డిఎస్పి రామాంజి నాయక్ దగ్గర ఉండి రోడ్డుపై ఉన్న భారీ వృక్షాన్ని తొలగించారు. వర్షం ఆదివారం వరకు కొనసాగితే రైతులు తీవ్రంగా నష్టానికి గురి అయ్యే అవకాశాలు ఉన్నాయి.